క్లుప్తంగా

స్కూటీ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దిపాడు: స్కూటీపై వెళుతున్న ఇద్దరు మహిళలకు కారు అడ్డుగా రావడంతో కిందపడి గాయాలపాలైన ఘటన మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో కొస్తాల సెంటర్ వద్ద జాతీయ హదారిపై చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం నాగులుప్పలపాడు మండలానికి చెందిన ఇద్దరు మహిళలు తాళ్లూరు మండలం విఠలాపురం, తురకపాలెం గ్రామ సచివాలయాల్లో గ్రామ సర్వేయర్లుగా పనిచేస్తున్నారు. వారిద్దరూ ఉద్యోగ నిమిత్తం వెళుతుండగా కొస్తాల సెంటర్ సమీపంలోకి వచ్చే సరికి వారి ముందు వెళుతున్న కారు అకస్మాత్తుగా స్లో కావడంతో స్కూటీ నడుపుతున్న రాజ్యలక్ష్మి కారును ఢీకొన్నారు. రాజ్యలక్ష్మితోపాటు వెనుక కూర్చున్న విమల కింద పడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడి డాక్టర్లు ప్రథమ చికిత్స చేశారు.

పొగాకు అమ్మకాలు

ఒంగోలు రూరల్: పొగాకు వేలం కేంద్రం-2లో మంగళవారం అత్యధిక ధర రూ.245 పలికింది. వేలం కేంద్రానికి 672 బేళ్లు రాగా 622 బేళ్లు కొనుగోళ్లు జరుగగా, 12 బేళ్లు నోబిడ్ అయ్యాయి. గరిష్ట ధర రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.236.69 గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి కె.రామకృష్ణ తెలిపారు.

అభివృద్ధి సొసైటీకి ఆర్థిక ఆమోదం



డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహంతో ప్రిన్సిపాల్ సుధాకర్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్‌కాలేజీ అభివృద్ధి సొసైటీకి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆర్థిక ఆమోదం తెలిపినట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసిహాన్ని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. అసిస్టెంట్ డైరెక్టర్ రాజమణి, డాక్టర్ తిరుమలరావు ఉన్నారు.

సురక్ష గ్యాస్ పైప్ వినియోగదారులకే బీమా

పొదిలి: ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీ ధ్రువీకరించిన సురక్ష పైపు, రెగ్యులేటర్ వినియోగదారులకు మాత్రమే ప్రమాద బీమా వర్తిస్తుందని స్థానిక కరుణ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సాయి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ప్రస్తుతం వాడుతున్న పైపు, రెగ్యులేటర్‌ను పరీక్షించుకుని, మార్చుకునేందుకు తమ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా నిర్దేశిత ప్రమాణాలతో కూడిన పైపు, రెగ్యులేటర్ అమర్చుతామని పేర్కొన్నారు.

అవాస్తవాలు ప్రచురించొద్దు

దర్శి: నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని దిన పత్రికల్లో అవాస్తవాలు ప్రచురిస్తున్నారని, అలా ఎక్కడా జరగడం లేదని సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ తెలిపారు. పట్టణంలోని పలు ఎరువులు విత్తనాల దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. బాలాజీనాయక్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో 16172 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నామన్నారు. గత సంవత్సరం 13 వేల నుంచి 14 వేల వరకు పత్తికి ధర పలకడంతో ఈ సంవత్సరం కూడా పంటపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్, వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు విత్తన షాపులపై అకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని అప్రమత్తం చేసి రాత్రి వేళల్లో జీపుల్లో వచ్చి అమ్మే వారిని గుర్తించాలని ఆదేశించినట్లు తెలిపారు. వివిధ కంపెనీలకు చెందిన 40 మంది ప్రైవేటు డీలర్‌ల నుంచి నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపినట్లు తెలిపారు. రైతులు ఎక్కడ కొనుగోలు చేసినా బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు.

సాగర్ నీరు పుష్కలం

- ఎస్ఎస్ ట్యాంకులకు సామర్థ్యం మేరకు సాగర్ నీరు
- రెండు ట్యాంకుల పూర్తి సామర్థ్యం 5,700 మిలియన్ లీటర్లు
- 4120.59 మిలియన్ లీటర్ల చేరిక
- పరిశీలించిన కమిషనర్



ఎస్ఎస్ ట్యాంకు-2కు సాగర్ నీరు చేరుతున్న తీరును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు రామతీర్థం నుంచి సాగర్ నీరు ముమ్మరంగా వచ్చి చేరుతోంది. ఈ నెల 9వ నుంచి రామతీర్థం జలాశయం నుంచి సాగర్ నీరు ఒంగోలు నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు వస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం రామతీర్థం నుంచి వస్తున్న నీటిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ప్రవాహానికి అడ్డంకులను నగర పాలక సంస్థ సిబ్బందితో తొలగింపజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకు-1, 2లోకి సాగర్ నీరు వచ్చి చేరుతోందన్నారు. గత 18 రోజులుగా సాగర్ నీరు ఎస్ఎస్ ట్యాంకులకు వస్తోందని చెప్పారు. ఎస్ఎస్ ట్యాంకు-1లో నీటి గరిష్ట నిల్వ 1950 మిలయన్ లీటర్లు (ఎంఎల్)కి గాను ఈ నెల 9వ తేదీనాటికి 924.24 ఎంఎల్ నిల్వ ఉండేదన్నారు. అలాంటిది సాగర్ నీరు వచ్చి చేరటంతో ప్రస్తుతం 1728.00 ఎంఎల్‌కు పెరిగిందన్నారు. అదేవిధంగా ఎస్ఎస్ ట్యాంకు-2లో గరిష్ట నిల్వ 3750 ఎంఎల్ కాగా ఈ నెల 9వ తేదీ నాటికి 434.32 ఎంఎల్ నీటి నిల్వ ఉందని తెలిపారు. అప్పటి నుంచి సాగర్ నీరు వచ్చి చేరటంతో అది కాస్తా ప్రస్తుతం 2392.59 ఎంఎల్‌కు చేరుకుందన్నారు. సాగర్ కాలువ ద్వారా నీటి వేగం తగ్గకుండా అక్కడక్కడా ఉన్న అడ్డంకులను తొలగించి మరీ నీటి వేగాన్ని పెంచామని చెప్పారు. దీంతో రెండు ఎస్ఎస్ ట్యాంకులకు సాగర్ నీరు వేగంగా వచ్చి చేరుతోందన్నారు. రెండు ట్యాంకులు పూర్తిగా నిండేవరకూ రామతీర్థం నుంచి నీటి సరఫరా చేయిస్తామని చెప్పారు. నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఎప్పటికప్పుడు సాగర్ నీటి విడుదల విషయంలో ఆరా తీస్తున్నారని చెప్పారు. ఒంగోలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాలినేని ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ప్రతి రోజూ సాగర్ కాలువను పరిశీలించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామని పేర్కొన్నారు. ఈ రెండు ట్యాంకులు నిండిన తరువాత రంగారాయుడు చెరువును కూడా నింపుతామన్నారు. రెండు ఎస్ఎస్ ట్యాంకుల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 5700 ఎంఎల్ కాగా ఇప్పటికి 4120.59 ఎంఎల్‌కు చేరుకున్నాయన్నారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

నెలవారీ లక్ష్యాలను చేరుకోవాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో ఇంటి పన్ను, కుళాయి పన్ను, క్లాప్ యూజర్ చార్జీల వసూలులో వెనుకబడితే సహించేది లేదని వార్డు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర మిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం 6వ డివిజన్‌లోని గోపాల్‌నగర్-3, నీలాయపాలెం సచివాలయాలను తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లలో నెలవారీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి లక్ష్యాలను చేరుకోకపోతే షో కాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అడ్మిన్, ఎమినిటీస్, శానిటేషన్ సెక్రటరీలు తమకు సంబంధించిన పన్ను వసూలు నెలవారీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి సెక్రటరీ వలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను బకాయిలున్న వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూడా సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వారికి అందాల్సిన సేవల గురించి వివరించాలని సూచించారు. జగనన్న భూ శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా సచివాల పరిధిలో జరుగుతున్న సర్వేలో అన్‌ట్రేస్‌డ్ (16ఏ), అన్ అసెస్‌డ్ (16ఏఏ) గురించి రెండు సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల పరిధిలో జరిగే అన్ని సర్వేలకు వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వే, పీఎం-జేఏవై సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు సర్వేలు ఎందుకు త్వరితగతిన పూర్తి చేసి ఇవ్వలేకపోతున్నారో సవివరంగా నివేదిక రూపంలో అందించాలని అడ్మిన్‌లను ఆదేశించారు. సక్రమంగా పనిచేయని సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. కమిషనర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

- గడప గడపలో సంక్షేమం
- సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన
- గడప గడపలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఎమ్మెల్యేకు హారతులు పడుతున్న మహిళలు

చీమకుర్తి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం పేర్నమిట్ట పరిధిలోని 40వ కార్పొరేట్ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ప్రయోజనం పొందిన లబ్ధిదారులతో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించారు. ఎంతెంత ఆర్థిక ప్రయోజనం కలిగిందో వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలు సంక్షేమ పథకాలు అందజేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు వివరించారు. లింగారెడ్డి కాలనీ, ఇందిరానగర్, ద్వారకా నగర్‌లో సాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో రూ.40 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. రూ.20 లక్షలతో చేపట్టనున్న సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తొలుత స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకి డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ కార్పొరేటర్ ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకం దిద్దుతూ హారతులు పడుతూ గడప గడపలో విశేషంగా హాజరై స్వాగతం పలికారు. టీజేఆర్‌ను గజ మాలతో సత్కరించారు. సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి తిరుపతి రావు, కండె రమణయాదవ్, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దుంపాయలమందారెడ్డి, కత్తినేని విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

జగనన్న సురక్షలో భాగస్వాములు కావాలి

కొత్తపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమస్యలు పరిష్కరించుకోవాలని ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య అన్నారు. మంగళవారం సచివాలయాల్లో పర్యటించారు. టోకెన్ జనరేట్ ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు.

ప్రతి ఒక్క అర్జీ పరిష్కారం

కొత్తపట్నం: ప్రతి ఒక్క అర్జీకి పరిష్కారం ఉంటుందని అందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్లూరు, ఈతముక్కల 1, 2 సచివాలయాలను సుజాత, అర్జున్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఎస్‌వీ ఆదిత్య బృందం వలంటీర్ సహాయంతో సందర్శించారు. టోకెన్ సేవలు పెంచడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏపీ సేవా పోర్టల్‌లో అన్ని మద్దతు పత్రాలను అప్‌లోడ్ ఎలా చేయాలో వివరించారు. 11 రకాల సంబంధించిన సర్టిఫికెట్లకు అర్జీ రూపంలో తీసుకుంటామన్నారు. వారం తరువాత పంపిణీ చేస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైన అల్లూరు, ఈతముక్కల గ్రామాల్లో 437 అర్జీలు వచ్చాయన్నారు. ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లకు 175, ఇన్‌కమ్ 136, కొత్త రేషన్ కార్డులకు 22, హౌస్ హోల్డ్ షిఫ్టింగ్‌కు 20, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు 13, ఆధార్ మొబైల్ లింగ్ 43, బర్త్ సర్టిఫికెట్లు 13, డెత్ సర్టిఫికెట్లు 6, సీసీఆర్‌సీ సర్టిఫికెట్లు 3, ముటేషన్‌కు 3, మ్యారేజ్ సర్టిఫికెట్లకు 3 వచ్చినట్లు తెలిపారు. ఇవి జూన్ 1 తేదీ నాటికి పరిష్కరించి, అందజేస్తామని తెలిపారు.



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న సుజాత, అర్జున్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న బాలచెన్నయ్య

పైప్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

ఒంగోలు రూరల్: రూరల్ లోని గుడిమెళ్లపాడు ఎస్సీ కాలనీ వరకు తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు రూరల్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ రాయపాటి అంకయ్య మంగళవారం ప్రారంభించారు. రాయపాటి అంకయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒత్తిడికి మంచినీటి పైపులైన్ పగిలిపోతున్నాయని.. మల్లవరం నుంచి మండువవారిపాలెం ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు అధిక ఒత్తిడితో రావడంతో ఈ విషయాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన స్పందించి మంజూరు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి జేసీబీ సాయంతో పనులు ప్రారంభించారు.



జేసీబీతో చేస్తున్న పనులు

పునరావాస కాలనీ పరిశీలన

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి బూరేపల్లి పునరావాస కాలనీలలో సమస్యలపై వచ్చిన అర్జీల ప్రకారం క్షేత్ర స్థాయిలో డీఎల్‌పీఓ పద్మజ మంగళవారం పరిశీలించారు. గుండ్లాపల్లి గ్రామ సెంటర్‌లో ఓ వ్యక్తి రెండు పొలాలను కలిపే దారి అక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నాడని గ్రామానికి చెందిన యువకులు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బూరేపల్లి పునరావాస కాలనీలో ఒకే ఇంటి స్థలానికి ఇద్దరు తమదంటూ పట్టాలు చూపుతున్నారంటూ ఫిర్యాదు అందింది. అనంతరం మద్దిపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యదర్శులు లతీఫ్, ఆశాలత పాల్గొన్నారు.




ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మజ

షెడ్‌ల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌ల నిర్వహణ మెరుగ్గా ఉండాలని ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి సంక్షేమ, అభివృద్ధి అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి రోజూ ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. ఇంటిలోనే తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇచ్చేలా గృహస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మండలం నుంచి రెండు గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేసి ఘన వ్యర్థాల నిర్వహణతో పాటు, ద్రవ వ్యర్థాల నిర్వహణ కూడా నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హార్టీ కల్చర్ ప్లాంటేషన్ లబ్ధిదారులను త్వరగా గుర్తించాలన్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది రెండు పూటల బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. తాగునీటి సరఫరా బిల్లులు జలజీవన్ మిషన్ క్రింద విడుదల చేస్తారని ఏఈలు ఏజెన్సీలకు తెలియచేయాలన్నారు. సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

సబ్సిడీ దాణా సిద్ధం



గొర్రెలు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీఏ

నాగులుప్పలపాడు: పశు పోషకుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందని పశు సంవర్థక శాఖ నాగులుప్పలపాడు ఏడీఏ నాగభూషరావు తెలిపారు. ప్రస్తుతం పశు సంవర్థక శాఖ తరపున పశు పోషకులకు ఇప్పటికే 26 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ దాణా అందించామని ఇంకా అవసరమైన రైతులు గ్రామ సచివాలయాల రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే సచివాలయ పశు సహాయకులను కలిసి ఇండెంట్ పెట్టించాలని తెలిపారు. అలాగనే 75 శాతం సబ్సిడీతో రైతులకు గడ్డి విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైఎస్సార్ పశు బీమా ద్వారా మండలంలో 516 పశువులు, గొర్రెలకు బీమా పూర్తి చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. మండలంలో పశు పోషకుల వద్ద 25 వేల గొర్రెలు, మేకలలో నట్టల నివారణకు జూన్ 15 నుంచి ప్రారంభించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇప్పటికే 90 శాతం నట్టల నివారణ మందు అందజేశామని చెప్పారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రమౌలీశ్వర్

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని మార్కాపురం డీవైఈఓ చంద్రమౌలీశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన పేరెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద పథకాలు అమలు చేస్తూ, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్ అందజేయడం ద్వారా విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోందని తల్లిదండ్రులకు వివరించారు. తొలుత ముఖ్యంత్రి వైఎస్ జగన్ సందేశాన్ని హెచ్ఎం నాగేశ్వరరావు చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పి.వెంకటరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండలంలోని గొట్లగట్టు కేజీబీవీలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి, అమలు చేస్తున్న పథకాలను ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ వివరించారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

మార్కాపురం టౌన్: గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసి గోవులను సంరక్షించాలని హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందించారు. గోవధ చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వీరారావు, హిందూ చైతన్య వేదిక నాయకులు వెంకటేశ్వరరెడ్డి, జె.శ్రీనివాసులు, లక్ష్మణ్, రంగస్వామిగౌడ్, ఎస్.వెంకటరెడ్డి, జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.